నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, బుధవారం 5 ఫిబ్రవరి 2025 | MEDAK

కేసీఆర్‌కు రెప్ప వెనుక స్వప్నం కవిత సంపుటిని అందజేస్తున్న కవయిత్రి సుజాతాప్రసాద్ దంపతులు

కేసీఆర్‌ను కలిసిన కవయిత్రి దంపతులు

దుబ్బాక, ఫిబ్రవరి 4 : బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను మంగళవారం దుబ్బాకకు చెందిన కవయిత్రి ఎర్రగుంట సుజాతాప్రసాద్ దంపతులు ఎర్రవల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. కవయిత్రి సుజాత రచించిన 'రెప్ప వెనుక స్వప్నం' అనే కవితా సంపుటి, ఆకాంక్ష, తదితర పుస్తకాలతో పాటు చిత్రపటాన్ని కేసీఆర్‌కు బహూకరించారు. కేసీఆర్ వారిని అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

స్థానిక ఎన్నికల్లో గులాబీజెండా ఎగరాలి

- కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి
- సమన్వయంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలి
- కార్యకర్తల సమావేశంలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్, ఫిబ్రవరి 4: స్థానిక సంస్థల ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా విఫలమైందని ఆయన అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని బీఎల్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన హుస్నాబాద్ మండల పార్టీ ముఖ్య కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సంసిద్ధులు కావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు గెలిచేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. నిత్యం ప్రజలతో మమేకమై కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంతోపాటు పాత, కొత్త కార్యకర్తలను కలిసి సమన్వయం చేసుకోవాలని సూచించారు. పనిచేసిన కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని, ఒకరికి సర్పంచ్ టికెట్ వస్తే మరొకరికి ఎంపీటీసీ తదితర టికెట్లు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. హామీలు, ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైన విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తే అన్ని గ్రామాలు, మండలాల్లో గులాబీజెండా రెపరెపలాడడం ఖాయమని వొడితెల సతీశ్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మహ్మదాపూర్ గ్రామ ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డి, బొల్లి తిరుపతి, కూచన పల్లి గ్రామానికి చెందిన గూల్ల చంద్రమౌళి తదితరులు సతీశ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సమావేశంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగం మధుసూదన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ మానస, మాజీ జడ్పీటీసీ భూక్యా మంగ, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, బొమ్మగాని శ్రీనివాస్, ఆలేటి మాధవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ పార్కుకు భూములివ్వం

ఆర్డీవోకు తేల్చిచెప్పిన చౌటపల్లి రైతులు

హుస్నాబాద్‌లో ఆర్డీవోతో మాట్లాడుతున్న చౌటపల్లి రైతులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 4: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేయబోయే ఇండస్ట్రియల్ పార్కుకు భూములు ఇవ్వమని చౌటపల్లి గ్రామ రైతులు ఆర్డీవో రామ్మూర్తికి తెగేసి చెప్పారు. మంగళవారం హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రామ్మూర్తిని రైతులు కలిశారు. సమస్యలపై వినతిపత్రం ఇవ్వాలని ఆర్డీవో సూచించడంతో రైతులు డీఏవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం డీఏవోకు రైతులు వ్యక్తిగతంగా వినతిపత్రాలు సమర్పించి రిసీవ్‌డ్ కాపీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తమ అంగీకారం లేకుండానే 124ఎకరాలు సేకరించినట్లు అధికారులు ఓ దినపత్రికలో ప్రకటన విడుదల చేశారని, ప్రకటనలో ప్రకటించిన పేర్లన్నీ తప్పుడు పేర్లేనని పేర్కొన్నారు. తమకున్న కొద్దిపాటి భూమిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇండస్ట్రియల్ పార్కుకు ఇవ్వమని గ్రామ సభలో చెప్పినప్పటికీ, అధికారులు తమ పేర్లను ప్రకటించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవనాధారమైన భూములను ఇవ్వబోమని ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఇచ్చామని, తమ అనుమతి లేకుండా ప్రకటించిన పేర్లను తొలిగించాలని డిమాండ్ చేశారు. ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు వైనాల శ్రీనివాస్, మాశం రాధ, గాదర్ల నాగభూషణం, సూరవ్వ, బాలవ్వ, రాణి, ఎల్లవ్వ, జ్యోతి, గణేశ్, లక్ష్మి, సుమంత్, కనుకమ్మ, 30మంది రైతులు ఉన్నారు.

సదరం స్లాట్ బుకింగ్ చేసుకునేందుకు కవేలి మీసేవ కేంద్రానికి వచ్చిన దివ్యాంగులు

సదరం సర్టిఫికెట్ల కోసం దివ్యాంగుల తిప్పలు

కోహీర్, ఫిబ్రవరి 4: సదరం సర్టిఫికెట్ల రెన్యువల్, కొత్తగా సదరం సర్టిఫికెట్లు పొందడానికి దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో దివ్యాంగులు అయోమయానికి గురవుతున్నారు. ప్రతి మంగళవారం దివ్యాంగులు తమ పేర్లను మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో మండలంలోని పలు గ్రామాల దివ్యాంగులు సమీపంలోని మీ సేవ కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవడానికి వస్తుంటారు. మంగళవారం కవేలి, దిగ్వాల్, కోహీర్, బిలాల్‌పూర్ గ్రామాల్లోని మీ సేవ కేంద్రాలకు వెళ్తే సైట్ ఓపెన్ కావడం లేదని మీసేవ ఆపరేటర్లు చెప్పడంతో దివ్యాంగులు నిరాశ చెందారు. సందరం సర్టిఫికెట్ల జారీ, రెన్యువల్ నిరంతర ప్రక్రియ అని జిల్లా అధికారులు చెబుతున్నారు.కానీ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. కోహీర్ మండలంలోని పలు గ్రామాల దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లు రెన్యువల్ కాకపోవడంతో ఏడు నెలలుగా పింఛన్ అందడం లేదు. రెన్యువల్‌కు ఇబ్బందులు ఎదురవుతుండడంతో దివ్యాంగులు పింఛన్ అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి చెబితేనే మీసేవ కేంద్రానికి వెళ్లామని, తీరా అక్కడి వెళ్లాక సైట్ ఓపెన్ కాకపోవడంతో ఇబ్బంది పడ్డామని మనియార్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సులభంగా సదరం సర్టిఫికెట్లు జారీ చేసి పింఛన్లు ఇప్పించాలని కోరుతున్నారు.

గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు(ఫైల్)

పరిహారం లెక్కతేలేనా !

ట్రిపుల్ ఆర్ భూసేకరణకు సమావేశాలతోనే సరిపెడుతున్న అధికారులు

- మార్కెట్ ధరకు మూడింతల పరిహారం డిమాండ్ చేస్తున్న రైతులు
- ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూపు
- ఆందోళనలో రైతులు.. ఎటూతేల్చని ప్రభుత్వం

గజ్వేల్, ఫిబ్రవరి 4: రీజినల్ రింగ్‌రోడ్డు (ట్రిపుల్ ఆర్) ఉత్తర భాగం భూసేకరణలో రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ట్రిపుల్ఆర్ భూసేకరణలో రైతులతో ఆర్డీవోలు నిర్వహించే సమావేశాల్లో ఎకరాకు ఎంత పరిహారం చెల్లిస్తారనే దానిపై స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు మాత్రం మార్కెట్ ధరకు మూడింతల పరిహారం ఇస్తేనే భూములు ఇస్తామని, లేకుంటే భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్నారు. ఉత్తర భాగంలోని ట్రిపుల్ఆర్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం త్వరగా పనులు పూర్తి చేయాలని చూస్తున్నది. కానీ, క్షేత్రస్థాయిలో పురోగతి లేదు. భూసేకరణ విషయంలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. రైతులకు, అధికారులకు మధ్య పరిహారం విషయంలో సఖ్యత కుదరడం లేదు. ట్రిపుల్ఆర్ భూ బాధితులతో ఇటీవల గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ సమావేశం నిర్వహించి భూసేకరణను కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నించారు. రైతులు డిమాండ్‌కు అధికారులు చెబుతున్న లెక్కలకు పొంతన కుదరడం లేదు. అధికారులు చెబుతున్న పరిహారం లెక్కలను తాము అంగీకరించబోమని రైతులు తేల్చి చెబుతున్నారు. గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో వ్యవసాయ భూములకు మంచి డిమాండ్ ఉంది. భూములు బాగా ధరలు పలుకుతున్నాయి. దీంతో రైతులు మార్కెట్ ధరకు మూడింతలు ధర చెల్లించడంతోపాటు ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నారు. అలాగైతేనే తాము సాగుభూములు ఇస్తామని అధికారులకు చెబుతున్నారు. అధికారుల, రైతుల మధ్య పొంతన కుదరకపోవడంతో పరిహారంపై ఏకాభిప్రాయం కుదిరేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భూసేకరణ కోసం రెవెన్యూ డివిజన్‌ల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి పరిహారం ఫైనల్ చేసే పనిలో అధికారులు ఉన్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో...

ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో 4,500 ఎకరాల వరకు ట్రిపుల్ఆర్ నిర్మాణం కోసం భూసేకరణ చేపట్టనుండగా, ఇందులో 180 ఎకరాల వరకు అటవీ భూములు ఉన్నాయి. గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో 70ఎకరాల మీదుగా ట్రిపుల్ఆర్ వెళ్లనున్నది. ఉమ్మడి మెదక్ జిల్లా



ట్రిపుల్ఆర్ రోడ్డు మ్యాప్

లోనే అత్యధికంగా గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 980 ఎకరాలు సేకరించనున్నారు. అందులో గజ్వేల్ పరిధిలో 32 కిలోమీటర్ల మేర రోడ్డు పనుల నిమిత్తం 17 గ్రామాల్లో, తూప్రాన్ పరిధిలో 14కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం 8గ్రామాల్లో, నర్సాపూర్‌లో 28కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం కోసం 14గ్రామాల్లో భూసేకరణ చేపట్టనున్నారు. అందోల్-జోగిపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో 8.5 కిలోమీటర్లకు రోడ్డు నిర్మాణానికి ఐదు గ్రామాల్లో, సంగారెడ్డి పరిధిలో 11గ్రామాల పరిధిలో 27.5 కిలోమీటర్ల భూసేకరణ చేపట్టనున్నారు.

గజ్వేల్ పరిధిలో 980 ఎకరాలు

గజ్వేల్ పరిధిలోని ఆయా గ్రామాల మీదుగా ట్రిపుల్ఆర్ రోడ్డు నిర్మాణం కోసం రైతులతో అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ట్రిపుల్ఆర్ ఉత్తర భాగం 158 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో రైతుల నుంచి 980 ఎకరాలను సేకరించనున్నారు. డివిజన్ పరిధిలోని జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి, ఇటిక్యాల, అలిరాజ్‌పేట, మర్కూక్ మండలం అంగడికిష్టాపూర్, చేబర్తి, పాతూర్, నర్సన్నపేట, ఎర్రవల్లి, గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్, ముట్రాజ్‌పల్లి, సంగాపూర్, మక్తమాసాన్‌పల్లి, బంగ్లావెంకటాపూర్, వర్గల్ మండలం మైలారం, జబ్బాపూర్, నెంటూర్, సామలపల్లి, రాయపోల్ మండలం బేగంపేట, ఎల్కల్ గ్రామాల్లోని రైతుల నుంచి 980 ఎకరాలను సేకరించనున్నారు.

గరిష్టంగా రూ.2 నుంచి రూ.3 కోట్లపైనే...

ట్రిపుల్ఆర్ రోడ్డు వెళ్లే మార్గంలో వ్యవసాయ భూములకు ఎకరాకు గరిష్టంగా ధర రూ.2నుండి రూ.3కోట్లపైనే ఉండగా , కనిష్టంగా రూ.50లక్షల వరకు ధర ఉంది. మార్కెట్ ధర అధికంగా ఉండడంతో రైతులు తమకు భూమికి భూమి లేదా మార్కెట్ ధరకు మూడింతలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ లెక్కనా రైతుల కోరుతున్న పరిహారంపై అధికారులు ఏవిధంగా నిర్ణయం తీసుకుంటారో చూడాలి. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో విలువైన భూములు ట్రిపుల్ఆర్ రోడ్డు నిర్మాణంలో పోతుండడంతో రైతులు దిగులు పడుతున్నారు.

సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు(ఫైల్)

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

సంగారెడ్డిలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

- ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో చర్యలు తీసుకోవాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కరాములు

సంగారెడ్డి, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ) : కేంద్ర బడ్జెట్ బాగాలేదని, బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కరాములు అన్నారు. మంగళవారం సంగారెడ్డిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ పాలనలో ప్రజల తలసరి ఆదాయం తగ్గిందని, ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిందన్నారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. రైల్వేబడ్జెట్‌లోనూ తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్టంలోని ఏ ఒక్క హామీని మోదీ సర్కార్ నెరవేర్చడం లేదన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రజాపోరాటాలు చేయనున్నట్లు చెప్పారు. ప్రజాపాలనను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చేలా సీపీఎం పోరాటం చేస్తుందని చుక్క రాములు పేర్కొన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా మీనమేషాలు లెక్కించడం తగదన్నారు. ఏ పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేలు గెలిచారో అదే పార్టీలో ఉండాలన్నారు. పార్టీలు ఫిరాయించటం సరికాదన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పీకర్ వెంటనే రాజ్యాంగపరంగా నిష్పక్షపాతమైన చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. ఒక పార్టీ గుర్తుపై గెలుపొంది మరోపార్టీలో చేరడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపిస్తే ఎమ్మెల్యేలు తమ స్వప్రయోజనాల కోసం పార్టీలు మారడం సరికాదని, వారిపై చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు తొత్తుగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. మోదీ ప్రజల కోసం కాకుండా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు, నాయకులు బి.మల్లేశం, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మెదక్ మెడికల్ కళాశాల తనిఖీ

మెదక్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): మెదక్ శివారులోని పిల్లికోటాల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంగళవారం కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్య విద్యార్థులతో మాట్లాడి బోధన వివరాలను తెలుసుకున్నారు. కళాశాల క్యాంటీన్, ల్యాబ్, హాస్టల్ వసతులపై ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్ కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన బోధన చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట వైస్‌ప్రిన్సిపాల్ జయ, సూపరింటెండెంట్ శివదయాళ్, సిబ్బంది ఉన్నారు.

మెదక్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

బొంతపల్లి అర్బన్ పార్కును ప్రారంభిస్తాం

- మంభాపూర్‌లో అర్బన్ పార్కు ఏర్పాటు చేస్తాం
- సంగారెడ్డి డీఎఫ్‌వో శ్రీధర్‌రావు

గుమ్మడిదల: బొంతపల్లి అర్బన్‌పార్కులో మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో శ్రీధర్‌రావు, డీఎఫ్ఆర్వో దేవిలాల్

గుమ్మడిదల, ఫిబ్రవరి4: బొంతపల్లి అర్బన్‌పార్కును త్వరలో ప్రారంభిస్తామని సంగారెడ్డి జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్ రావు తెలిపారు. 'అర్బన్‌పార్కుకు మోక్షమెప్పుడో'? అని సోమవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి అటవీశాఖ అధికారులు స్పందించారు. మండలంలోని బొంతపల్లి అర్బన్ పార్కును జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్‌రావు మంగళవారం డీఎఫ్ఆర్వో దేవిలాల్, గుమ్మడిదల సెక్షన్ ఆఫీసర్ హుస్సేన్, బీట్ రూట్ సిబ్బంది శ్రీకాంత్, రత్నం తదితరులతో కలిసి సందర్శించారు. అర్బన్‌పార్కులో 90శాతం పనులు పూర్తి కాగా, మిగిలిన 10శాతం పనులు త్వరలో పూర్తి చేసి పర్యాటకులకు, ప్రకృతి ప్రేమికులకు అందుబాటులోకి తెస్తామని డీఎఫ్‌వో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషితో మండలంలోని మంభాపూర్ అటవీలో నూతనంగా అర్బన్ పార్కును ఏర్పాటు చేస్తామని డీఎఫ్‌వో తెలిపారు. నర్సాపూర్, బొంతపల్లి అర్బన్‌పార్కులతో పాటు అద్భుతంగా మంభాపూర్ అటవీలో అర్బన్ పార్కును ఏర్పాటు చేసి కొండపైన వాచ్‌టవర్‌ను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. జాతీ య రహదారి 765డీ సమీపంలో ఉండడంతో అర్బన్ పార్కును పర్యాటకులు అధికంగా సందర్శించే అవకాశం ఉంటుందనే ఆలోచనతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అటవీ ప్రాంతాల గుండా వెళ్లే రోడ్లపై కోతులకు వాహనదారులు ఆహార పదార్థాలు వేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రయాణికులెవరూ వేయవద్దని డీఎఫ్‌వో సూచించారు.

జాతీయస్థాయి ఈత పోటీలకు ఎంపిక

డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌తో నర్సింహులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 4: గుజరాత్‌లో మార్చి 3న జరగనున్న జాతీయస్థాయి ఈత పోటీలకు సిద్దిపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బండి నర్సింహులు ఎంపిక య్యారు. హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఈవీ నరసింహారెడ్డిని మంగళవారం నర్సింహులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నర్సింహులు జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో విజేతగా నిలిచి డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని కమిషనర్ కోరారు.

ఎండలో పంటను బైక్‌పై తీసుకువెళ్తున్న సిద్దిపేట రైతులు

ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా మారిన సిద్దిపేట-హుస్నాబాద్ రోడ్డు

ఎండలు ఘరూ..

నాలుగైదు రోజులుగా ఎండ తీవ్రత పెరిగింది. రాత్రిళ్లు చలి, రోజంతా ఎండ, ఉక్కపోతతో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడే ఎండల తీవ్రత ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎలా ఉంటాయోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఉదయం పది గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. దీంతో రోడ్లపై బైక్‌లు, కాలినడకన వెళ్లేవారు, చిరువ్యాపారులు ఎండ నుంచి రక్షణకు నెత్తికి క్యాపులు, కాటన్ రుమాల్ ధరిస్తున్నారు. పండ్ల రసాలు, చెరుకు జ్యూస్ స్టాళ్లు వెలుస్తున్నాయి. బస్టాప్‌లు, కూడళ్ల వద్ద వాహనాలు, బస్సుల కోసం నిరీక్షించేవారు ఎండ నుంచి రక్షణకు చెట్లను ఆశ్రయిస్తున్నారు. రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకుని బతికే చిరువ్యాపారులు గొడుగులు వినియోగిస్తున్నారు.

– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సిద్దిపేట, ఫిబ్రవరి 4

ముస్తాబాద్ చౌరస్తాలో చెరుకు రసం తాగుతున్న ప్రజలు

గొడుగుపెట్టుకొని వ్యాపారం

సిద్దిపేటలో ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న జనం